సాక్షి తూర్పుగోదావరి

ఆదివారం । 13 । జూలై । 2025



రూ.1,01,116 విరాళం


అన్నవరం: సత్యదేవుని నిత్యాన్నదాన పథకానికి నడిమింటి నూకరాజు, సూరమ్మ దంపతులు (కొంతమూరు) శనివారం రూ.1,01,116 విరాళం సమర్పించారు.



అంతర్వేదిలో..

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనరసింహస్వామి వారి నిత్యాన్నదాన ట్రస్టుకు టీవైఎన్ శ్రీనివాస్, ఎన్‌జీ శ్రీహరిక దంపతులు (పాలకొల్లు) శనివారం రూ.1,01,116 విరాళం అందజేశారు.

డెల్టాలకు 14,200 క్యూసెక్కులు



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గోదావరి డెల్టా కాలువలకు శనివారం 14,200 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ఇందులో తూర్పు డెల్టాకు 4,800, మధ్య డెల్టాకు 2,600, పశ్చిమ డెల్టాకు 6,800 క్యూసెక్కుల నీటిని వదిలారు.

అస్మదీయులకే సంపద సృష్టి

- టీడీపీ నేతల చేతుల్లోకి ఎఫ్‌సీలు
- కాకినాడ, రాజానగరం ఏటీఎస్‌లు వారికే..
- గతంలో రవాణా శాఖ పరిధిలోనే ఎఫ్‌సీల జారీ
- నేడు ప్రైవేటీకరించడంపై సర్వత్రా నిరసన

సాక్షి, రాజమహేంద్రవరం: ఇప్పటికే మద్యం, ఇసుకను కట్టబెట్టడంతో కూటమి నేతలు రూ.కోట్లు కొల్లగొడుతున్నారు. తాజాగా ఆ జాబితాలోకి రాష్ట్ర రవాణా శాఖ కూడా చేరింది. ఈ శాఖలో అత్యంత కీలకమైన వాహనాల ఫిట్‌నెస్ సర్టిఫికెట్ల (ఎఫ్‌సీ) జారీ సేవలను టీడీపీ నేతలకు చెందిన ప్రైవేటు సంస్థకు ప్రభుత్వం కట్టబెట్టింది. ఎఫ్‌సీల జారీలో రాష్ట్ర రవాణా శాఖను డమ్మీగా చేసేశారు. స్థానికంగా ఏ అధికారికీ తనిఖీ బాధ్యతలు అప్పజెప్పలేదు. ఇప్పటి వరకూ రవాణా శాఖ కార్యాలయంలో వాహనాలకు ఎఫ్‌సీలు జారీ చేసేవారు. ఆన్‌లైన్‌లో స్లాట్ బుక్ చేసుకుంటే ఆయా వాహనాలకు ప్రభుత్వం నిర్ణయించిన చార్జీ ప్రకారం చలానా కట్టించుకుని ఎఫ్‌సీ మంజూరు చేసేవారు. ఇటీవల కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం ప్రకారం లైట్, హెవీ మోటార్ వెహికల్స్‌కు ఎఫ్‌సీల జారీ చేసే పనిని తాజాగా ఓ ప్రైవేటు సంస్థకు అప్పగించారు. దీనిపై ఎవ్వరికీ అజమాయిషీ ఉండదు. నేరుగా కేంద్ర ప్రభుత్వమే పర్యవేక్షిస్తుంది. ఈ విధానాన్ని వాహన యజమానులు, డ్రైవర్లు, వివిధ పార్టీల నేతల తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ఏవైనా ప్రమాదాలు జరిగితే ఎవరిని అడగాలని ప్రశ్నిస్తున్నారు.

చక్రం తిప్పిన కీలక మంత్రి!

కొత్త విధానంలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా ప్రతి జిల్లాకు ఒక ఆటోమేటెడ్ వెహికల్ ఫిట్‌నెస్ టెస్టింగ్ స్టేషన్ (ఏటీఎస్) మంజూరు చేశారు. తొలి దశలో 15 ఏటీఎస్‌లు ప్రారంభించారు. ఇదే అదనుగా రంగంలోకి దిగిన టీడీపీ నేతలు సింహభాగం సెంటర్లను కైవసం చేసుకున్నారు. అది కూడా యువగళం పాదయాత్ర చేసిన వారికే దక్కాయి. దీని వెనుక కీలక మంత్రి ఒకరు చక్రం తిప్పినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. కాకినాడ, రాజానగరం, అనకాపల్లి ప్రాంతాల్లో మాత్రం ఓ రాజ్యసభ సభ్యుడి అనుయాయులకు అప్పగించారు. రాష్ట్రవ్యాప్తంగా ఇదే తంతు నడిచినట్లు తెలిసింది.

రూ.కోట్లు కొల్లగొట్టేలా..

ఒక ఏటీఎస్ ఏర్పాటుకు సుమారు రూ.5 కోట్లు ఖర్చవుతుంది. దీనిలో ప్రభుత్వం ఏకంగా రూ.3 కోట్ల సబ్సిడీ ఇస్తోంది. మిగిలిన రూ.2 కోట్లు మాత్రమే ఆ ప్రైవేటు సంస్థ వెచ్చించాలి. ఎఫ్‌సీల జారీ ద్వారా ప్రతి జిల్లాలో రూ.కోట్లు వసూలవుతాయి. కేంద్ర ట్రాన్స్‌పోర్ట్ ఇండియా సలహా మేరకు ఫిట్‌నెస్ టెస్ట్‌ల ద్వారా రెండేళ్ల పాటు వసూలు చేసిన సొమ్మును ఆ సంస్థ సొంతానికి వినియోగించుకోవచ్చు. ప్రభుత్వానికి ఒక పైసా కూడా చెల్లించనవసరం లేదు. అటువంటప్పుడు ఆ సంస్థకు సబ్సిడీ ఇవ్వడమేమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని రకాల వాహనాలూ కలిపి సుమారు 1.80 కోట్లు ఉన్నాయి. వీటిలో ఏటా 15 లక్షల వాహనాలు ఎఫ్‌సీ కోసం వస్తాంటాయి. వీటి ద్వారా ప్రభుత్వానికి ఏటా రూ.150 కోట్ల ఆదాయం వస్తుంది. ఇప్పుడు ఎఫ్‌సీల జారీని ప్రైవేటు సంస్థకు అప్పగించడంతో ప్రభుత్వ ఆదాయానికి ఆమేరకు గండి పడింది. మరోవైపు ఎఫ్‌సీల జారీని ప్రైవేటు సంస్థకు ఏకంగా 20 ఏళ్లకు రాసివ్వడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రపంచ బ్యాంకు, వివిధ సంస్థల నుంచి అప్పులు తీసుకువచ్చేందుకే కూటమి ప్రభుత్వం ఇలా దీర్ఘకాలిక లీజులు ఇస్తోందని వివిధ రాజకీయ పార్టీల నేతలు ఆరోపిస్తున్నారు.

మళ్లీమళ్లీ చలానాలు

ఎఫ్‌సీ పొందేందుకు తొలుత సంస్థ నిర్దేశించిన మొత్తాన్ని ఆన్‌లైన్‌లో చెల్లించి స్లాట్ బుక్ చేసుకోవాలి. అనంతరం నిర్దేశించిన సమయంలోగా వాహనాన్ని తనిఖీ చేయించుకోవాలి. లేదంటే తిరిగి చలానా తీయాల్సి వస్తోంది. గతంలో చలానాకు వారం నుంచి 15 రోజుల వరకూ గడువుండేది. ప్రస్తుతం అలాంటి పరిస్థితులు లేవని వాహనదారులు వాపోతున్నారు. పైగా గతంలో కంటే చలానా మొత్తాన్ని భారీగా పెంచారని మండిపడుతున్నారు. గతంలో వాహనంలో చిన్నపాటి లోపాలుంటే సరిచేసుకుని వస్తే ఎఫ్‌సీ ఇచ్చేవారు. ప్రస్తుతం బ్రేక్ ఆయిల్ తక్కువగా ఉండటం చిన్నపాటి లోపాలున్నా అన్‌ఫిట్ చేసేస్తున్నారు. ఆ విషయం వారం తర్వాత మెసేజ్ ద్వారా తెలుస్తోంది. అప్పటికే చలాగా గడువు ముగిసిపోతూండటంతో మళ్లీ కట్టాల్సి వస్తోంది. ఇదే అదనుగా బ్రోకర్లు రంగంలోకి దిగి రూ.వేలు వసూలు చేస్తున్నారు.

దూరాభారం

ఏటీఎస్‌లను జిల్లా కేంద్రాలకు దూరంగా ఏర్పాటు చేశారు. జిల్లాలోని 18 మండలాలకు సంబంధించి రాజానగరం వద్ద ఏటీఎస్ పెట్టారు. నల్లజర్ల నుంచి రాజానగరం వచ్చి వెళ్లాలంటే రాను పోను 150 కిలోమీటర్లు ప్రయాణించాల్సి వస్తోంది. ఇది దూరాభారమవుతోందని వాహనదారులు ఆవేదన చెందుతున్నారు. దీనివలన పనులు మానుకుని రావాల్సిన పరిస్థితి తలెత్తుతోందని ఆటో, మ్యాక్సీ క్యాబ్ డ్రైవర్లు వాపోతున్నారు. ఎఫ్‌సీల జారీని ప్రైవేటీకరించడంపై మాజీ ఎంపీ, వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి మార్గాని భరత్‌రామ్, వివిధ రవాణా వాహన కార్మిక సంఘాల ప్రతినిధుల జేఏసీ కన్వీనర్లు వాసంశెట్టి గంగాధరరావు, బాక్స్ ప్రసాద్ తదితరుల ఆధ్వర్యాన రవాణా కార్మికులు రాజానగరం ఏటీఎస్ వద్ద ఇటీవల నిరసన తెలిపారు.



ఫిట్‌నెస్ సెంటర్ వద్ద వాహనాలు



రాజానగరం ఫిట్‌నెస్ సెంటర్ వద్ద ఇటీవల మాజీ ఎంపీ మార్గాని భరత్, వాసంశెట్టి గంగాధర్, కార్మికుల నిరసన

పలు రాష్ట్రాల్లో వ్యతిరేకత

కేంద్రం తీసుకు వచ్చిన ఎఫ్‌సీల జారీ ప్రైవేటీకరణ విధానాన్ని తొలుత రాజస్థాన్, కర్ణాటక, గుజరాత్ రాష్ట్రాల్లో అమలు చేశారు. వాహన కార్మికుల నుంచి వ్యతిరేకత రావడంతో కర్ణాటక, రాజస్థాన్ ప్రభుత్వాలు దీని అమలును నిలిపివేశాయి. పాత, కొత్త విధానాల్లో ఎఫ్‌సీలు చేయించుకునేలా గుజరాత్ వెసులుబాటు కల్పించింది. మిగిలిన రాష్ట్రాలు నూతన విధానం అమలు చేయడం లేదు. కానీ, మన రాష్ట్రంలో సంపద సృష్టిస్తామంటూ అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం కేవలం అస్మదీయులకు సంపద సృష్టించేందుకే ఈ విధానం అమలు చేస్తున్నట్లుందనే విమర్శలు వస్తున్నాయి.

చలానాల పెంపు (రూ.లు)

వాహనం	పాత చలానా	కొత్త చలానా	బాదుడు
లారీ	920	1,320	400
మినీ వ్యాన్	920	1,320	400
ఎల్ఎంవీ	720	920	200
ఆటో	620	820	200

జిల్లాలో వాహనాలు

వాహనం	సంఖ్య
ద్విచక్ర వాహనాలు	3,41,117
కార్లు	45,404
ఆటో	21,726
గూడ్స్ క్యారియర్లు	20,465
ట్రాక్టర్లు	7,807
ట్రాలీలు	4,896
త్రీ వీలర్ గూడ్స్ వాహనాలు	3,599
ట్రైలర్ (అగ్రికల్చర్)	2,306
స్కూల్, కాలేజీ బస్సులు	1,827
లగ్జరీ టూరిస్ట్ క్యాబ్‌లు	342
అంబులెన్స్‌లు	230
జీపులు	150
రోడ్ రోలర్లు	67

ఫిట్‌నెస్ ప్రైవేటీకరణపై పోరాటం



కార్మికులు ఏమీ చేయలేరన్న ఉద్దేశంతో ఫిట్‌నెస్ ప్రైవేటీకరణకు నాంది పలకడం దారుణం. దీనిని ఉపసంహరించుకునేంత వరకూ ఉధృతంగా పోరాడతాం. ఈ విషయంలో కార్మిక జేఏసీ తీసుకున్న నిర్ణయానికి వైఎస్సార్ సీపీ సంపూర్ణ మద్దతు ఇస్తుంది. మాజీ సీఎం వైఎస్ జగన్ అండగా ఉంటారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వాహనమిత్ర ద్వారా రూ.10 వేల ఆర్థిక సాయం ఇచ్చేది. ఇప్పుడు కూటమి ప్రభుత్వం అది ఇవ్వడం లేదు. ఏ ప్రభుత్వం మంచి చేసిందో కార్మికులు గ్రహించాలి.

– మార్గాని భరత్‌రామ్, వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి, మాజీ ఎంపీ, రాజమహేంద్రవరం

ఉపసంహరించుకోవాలి



ఫిట్‌నెస్ జారీని ప్రైవేటు సంస్థలకు అప్పజెప్పడాన్ని వ్యతిరేకిస్తున్నాం. దీనిని తక్షణమే ఉపసంహరించాలి. చలానా విధానంతో కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రైవేటు వ్యక్తులకు సామర్థ్య పరీక్షలు అప్పగిస్తే పారదర్శకత ఏం ఉంటుంది? ఒక వాహనానికి పరీక్ష చేయాలంటే 40 నిమిషాలు పడుతోంది. కొన్ని పాఠశాలలు, కళాశాలలకు చెందిన వాహనాలు సెంటర్ వద్దకు రాకపోయినా ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు ఇచ్చేస్తున్నారు.

– వాసంశెట్టి గంగాధరరావు, కార్మిక సంఘాల ప్రతినిధుల జేఏసీ కన్వీనర్, రాజమహేంద్రవరం

న్యూస్‌రీల్

అన్నవరప్పాడులో భక్తుల రద్దీ



ప్రత్యేక అలంకరణలో స్వామి, అమ్మవార్లు

పెరవలి: వేలాదిగా భక్తులు తరలిరావడంతో అన్నవరప్పాడు వేంకటేశ్వరస్వామి ఆలయంలో రద్దీ ఏర్పడింది. రెండో శనివారం సెలవు కావడంతో వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తెల్లవారుజాము నుంచే తరలివచ్చి ఆలయ ప్రాంగణం చుట్టూ బారులు తీరారు. ముడుపులు, మొక్కులు చెల్లించుకున్నారు. వందలాది మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారికి అభిషేకం నిర్వహించిన అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. స్వామివారి దర్శనానికి గంట సమయం పట్టింది. స్వామి, అమ్మవార్లను అర్చకులు బీరకాయలతో విశేషంగా అలంకరించారు. సుమారు 7 వేల మంది భక్తులకు అన్నసమారాధన నిర్వహించినట్లు ఆలయ ఈఓ మీసాల రాధాకృష్ణ తెలిపారు.

తొలి తిరుపతికి పోటెత్తిన భక్తులు



ప్రత్యేకాలంకరణలో శృంగార వల్లభ స్వామి

పెద్దాపురం: మండలంలోని తొలి తిరుపతి గ్రామంలో వెలసిన స్వయంభూ శృంగార వల్లభస్వామి ఆలయానికి శనివారం భక్తులు అధిక సంఖ్యలో పోటెత్తారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు సుమారు 25 వేల మంది స్వామివారిని దర్శించుకున్నారు. ముడుపులు, మొక్కులు చెల్లించుకున్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారిని అర్చకులు పెద్దింటి నారాయణాచార్యులు, పురుషోత్తమాచార్యులు విశేషంగా అలంకరించారు. వివిధ సేవల టికెట్లు, అన్నదానం, కేశఖండన ద్వారా దేవస్థానానికి రూ.3,73,904 ఆదాయం సమకూరిందని ఆలయ ఈఓ వడ్డి శ్రీనివాస్ తెలిపారు. ఐదు వేల మంది భక్తులకు ప్రసాద వితరణ, అన్నదానం ఏర్పాటు చేశామన్నారు.

లోవ భక్తులకు సత్యదేవుని ప్రసాదం సిద్ధం

అన్నవరం: ఆషాఢ మాసం మూడో ఆదివారం తలుపులమ్మ అమ్మవారి దర్శనానికి లోవ వెళ్లి వచ్చే భక్తులకు సత్యదేవున్ని గోధుమ నూక ప్రసాదం సిద్ధమవుతోంది. వారికి విక్రయించేందుకు లక్షకు పైగా సత్యదేవుని ప్రసాదం ప్యాకెట్లు సిద్ధం చేస్తున్నారు. గత ఆదివారం కొండ దిగువన, జాతీయ రహదారిపై ఉన్న నమూనా ఆలయాల వద్ద లోవ భక్తులు సత్యదేవుని ప్రసాదం ప్యాకెట్లు సుమారు 60 వేలు కొనుగోలు చేసిన విషయం తెలిసిందే. ఈ ఆదివారం అంతకన్నా ఎక్కువగా కొనుగోలు చేస్తారనే అంచనాతో అన్నవరం దేవస్థానం అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. రత్నగిరిపై సత్యదేవుని దర్శనానికి వచ్చే భక్తుల కోసం సుమారు 60 వేలలు, లోవ భక్తుల కోసం సుమారు లక్ష ప్రసాదం ప్యాకెట్లు సిద్ధం చేస్తున్నామని అధికారులు తెలిపారు. ప్రసాదాల విక్రయాల ద్వారా ఆదివారం సుమారు రూ.30 లక్షల ఆదాయం వచ్చే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు.

కిక్కిరిసిన రత్నగిరి



సత్యదేవుని దర్శనానికి క్యూ కట్టిన భక్తులు

అన్నవరం: రత్నగిరి వాసుడు సత్యదేవుని ఆలయానికి శనివారం భక్తులు వేలాదిగా పోటెత్తారు. రెండో శనివారం, విద్యా సంస్థలు, ప్రభుత్వ కార్యాలయాలకు సెలవు కావడంతో ఉదయం నుంచే స్వామివారి సన్నిధికి భారీగా భక్తులు తరలివచ్చారు. దీంతో, ఆలయ ప్రాంగణం, వ్రత మండపాలు, క్యూలైన్లు భక్తులతో కిక్కిరిసిపోయాయి. సత్యదేవుని ఉచిత దర్శనానికి గంట, ప్రత్యేక దర్శనానికి అరగంట పట్టింది. సుమారు 30 వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. సత్యదేవుని వ్రతాలు రెండు వేలు జరిగాయి. అన్ని విభాగాల ద్వారా దేవస్థానానికి రూ.30 లక్షల ఆదాయం సమకూరింది. నిత్యాన్నదాన పథకంలో సుమారు 5 వేల మంది భక్తులు సత్యదేవుని అన్నప్రసాదం స్వీకరించారు. ఆలయ ప్రాకారంలో ఉదయం సత్యదేవుడు, అమ్మవారిని తిరుచ్చి వాహనంపై ఘనంగా ఊరేగించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం ఈఓ వీర్ల సుబ్బారావు దంపతులతో పాటు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. సత్యదేవుని ఆలయానికి ఆదివారం కూడా పెద్ద సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉంది. ఉదయం 10 గంటల నుంచి ఆలయ ప్రాకారంలో సత్యదేవుడు, అమ్మవారిని టేకు రథంపై ఊరేగిస్తారు.

సమన్వయంతో సత్వర న్యాయం




స్టాల్స్‌ను పరిశీలిస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత తదితరులు

రాజమహేంద్రవరం రూరల్: సమన్వయంతో సత్వర న్యాయం లభించేందుకు అవకాశం ఉంటుందని జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత అన్నారు. ఎస్పీ డి.నరసింహ కిషోర్ ఆధ్వర్యాన నగరంలో శనివారం కో ఆర్డినేషన్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ ఏడాది నమోదైన కేసులపై వివిధ శాఖలను సమన్వయపరిచేలా ఆయా శాఖల ఉన్నతాధికారులతో ఈ అర్ధ సంవత్సర సమావేశం ఏర్పాటు చేశారు. పోలీసు కేసుల దర్యాప్తులో ప్రముఖ పాత్ర పోషించే న్యాయ, రెవెన్యూ, మెడికల్, మునిసిపల్, ఫోరెన్సిక్, ఆర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్, రోడ్ ట్రాన్స్‌పోర్ట్ అథారిటీ, నేషనల్ హైవే అథారిటీ, ఎక్సైజ్, జైళ్లు, రైల్వే, విద్య, ఏపీఎస్ ఆర్టీసీ, అగ్నిమాపక శాఖల ఉన్నతాధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. విధి నిర్వహణలో పోలీసు శాఖ నిత్యం ఎదుర్కొంటున్న వివిధ సమస్యలు తెలుసుకున్నారు. వాటిని పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటామని ఆయా శాఖల ఉన్నతాధికారులు చెప్పారు. ఈ సందర్భంగా వివిధ శాఖల ఉన్నతాధికారులను ఎస్పీ నరసింహ కిషోర్ సత్కరించారు. సబ్ డివిజన్ల వారీగా పనితీరు, డ్రోన్ కెమెరాల ప్రత్యేక స్టాల్స్ ఆహూతులను ఎంతో ఆకట్టుకున్నాయి. అనంతరం, ఈ సంవత్సరం ఇప్పటి వరకూ నమోదైన కేసులపై జిల్లా పోలీసు అధికారులతో ఎస్పీ కూలంకషంగా చర్చించారు. వచ్చే అర్ధ సంవత్సర కార్యాచరణపై అధికారులకు పలు సూచనలు చేశారు. గడచిన అర్ధ సంవత్సరంలో వివిధ కేసుల పరిష్కారంలో ఉత్తమ ప్రతిభ చూపిన అధికారులను, సిబ్బందిని ఎస్పీ సత్కరించారు. సమావేశంలో జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ కార్యదర్శి శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కూటమి పాలనలో దళితులకు రక్షణ కరవు

- బాధిత మహిళను స్థానిక ఎమ్మెల్యే పరామర్శించకపోవడం దారుణం
- మాజీ హోం మంత్రి తానేటి వనిత



బాధిత మహిళ బుజ్జిని ఆసుపత్రిలో పరామర్శిస్తున్న మాజీ మంత్రులు తానేటి వనిత, చెల్లుబోయిన వేణు, మాజీ ఎమ్మెల్యేలు జక్కంపూడి రాజా, తలారి వెంకట్రావు, డాక్టర్ సూర్యనారాయణరెడ్డి

అనపర్తి: కూటమి ప్రభుత్వ హయాంలో దళితులకు అందున మహిళలకు రక్షణ కరవైందని మాజీ హోం మంత్రి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ సభ్యురాలు తానేటి వనిత ఆవేదన వ్యక్తం చేశారు. దుప్పలపూడి గ్రామానికి చెందిన దళిత మహిళ కొమ్ము బుజ్జిపై పాశవిక దాడి జరిగి, వారం రోజులు కావస్తున్నా బాధితురాలిని స్థానిక బీజేపీ ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి కనీసంగా కూడా పరామర్శించకపోవడం దారుణమని దుయ్యబట్టారు. గ్రామానికి చెందిన టీడీపీ నేత నల్లమిల్లి వెంకటరెడ్డి సెటిల్‌మెంట్ వ్యవహారంలో దాడికి గురై, అనపర్తి ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధిత మహిళ కొమ్ము బుజ్జిని వనిత శనివారం పరామర్శించారు. ఆమెతో పాటు వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు మాజీ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ, యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు జక్కంపూడి రాజా, మాజీ ఎమ్మెల్యేలు తలారి వెంకట్రావు, డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి కూడా బాధితురాలికి, ఆమె కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా వనిత, చెల్లుబోయిన వేణు మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత అధికార పార్టీ నాయకులు పెత్తందారీ పోకడలకు పోతున్నారని విమర్శించారు. రక్షణ కల్పించాలని పోలీసులకు ఫిర్యాదు చేసి, ఇంటికి వస్తున్న తనపై.. తమ మాట వినలేదనే కక్షతో సుమారు 15 మంది దారి కాచి, వీధి లైట్లు ఆర్పివేసి, రాళ్లు, ఇనుప రాడ్లతో దాడి చేసి, హతమార్చేందుకు ప్రయత్నించారని బాధిత మహిళ కొమ్ము బుజ్జి చెబుతోందని అన్నారు. అయినప్పటికీ పోలీసులు ఆమె రోదనను పట్టించుకోకుండా.. సంబంధం లేని సెక్షన్లు పెట్టి, కేసును నీరుగారుస్తున్నారని ఆరోపించారు. ఇదంతా చూస్తూంటే తన అనుచరులను కాపాడుకోవడానికి స్థానిక ఎమ్మెల్యే ఒక పతకం ప్రకారమే ప్రజల్లో భయాందోళనలు సృష్టించి పబ్బం గడుపుకొనేందుకు ప్రయత్నిస్తున్నారనే అనుమానాలు కలుగుతున్నాయని అన్నారు. మాజీ మంత్రి వేణు మాట్లాడుతూ, ఆవు చేలో మేస్తే దూడ గట్టున మేస్తుందా అన్నట్టు.. ముఖ్యమంత్రి చంద్రబాబు తనయుడు లోకేష్ రెడ్‌బుక్ పట్టుకుని తిరుగుతూంటే.. నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలు కూడా వారి బాటలోనే అమాయక ప్రజలపై దాడులు చేస్తూ భయాందోళనలు సృష్టిస్తున్నారని ఆరోపించారు. ప్రాణభయంతో ఆందోళన చెందుతున్న బాధిత మహిళకు, ఆమె కుటుంబానికి పోలీసులు రక్షణ కల్పించాలని, అలాగే కేసులోని సెక్షన్లు మార్చి నిందితులకు కఠిన శిక్ష పడేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

గోదావరి పరవళ్లు

- కడలిలోకి 5.29 లక్షల క్యూసెక్కులు
- ఎగువన తగ్గుతున్న వరద ఉధృతి

ధవళేశ్వరం: గోదావరి పరవళ్లు తొక్కుతోంది. ఎగువ నుంచి వచ్చి చేరుతున్న నీటితో నది ఉధృతి క్రమేపీ పెరుగుతోంది. దీంతో అప్రమత్తమైన ఇరిగేషన్ అధికారులు మిగులు జలాలను ఎప్పటికప్పుడు సముద్రంలోకి విడిచిపెడుతున్నారు. ధవళేశ్వరం కాటన్ బ్యారేజీ వద్ద నీటిమట్టం శనివారం రాత్రి 10.60 అడుగులకు చేరింది. బ్యారేజీ నుంచి 5,29,209 క్యూసెక్కుల మిగులు జలాలను సముద్రంలోకి విడిచిపెట్టారు. ధవళేశ్వరం వద్ద వరద ఉధృతి ఆదివారం మరింత పెరిగే అవకాశం ఉంది. కాటన్ బ్యారేజీ వద్దకు సుమారు 7 లక్షల క్యూసెక్కుల నీరు వచ్చి చేరే అవకాశం ఉందని ఇరిగేషన్ అధికారులు అంచనా వేస్తున్నారు. మరోవైపు ఎగువ ప్రాంతాల్లో నది ఉధృతి క్రమంగా తగ్గుతోంది. భద్రాచలం వద్ద శనివారం 41.10 అడుగులకు చేరిన నీటిమట్టం క్రమేపీ 40.90 అడుగులకు తగ్గింది. దీంతో, ఆదివారం సాయంత్రం నుంచి ధవళేశ్వరం వద్ద కూడా వరద ఉధృతి తగ్గే అవకాశం ఉందని ఇరిగేషన్ అధికారులు భావిస్తున్నారు.



కాటన్ బ్యారేజీ నుంచి సముద్రంలోకి విడిచిపెడుతున్న మిగులు జలాలు

ఎగువ ప్రాంతాల్లో గోదావరి నీటిమట్టాలు (మీటర్లలో)

కాళేశ్వరం	8.77
పేరూరు	13.87
దుమ్ముగూడెం	11.50
కూనవరం	16.14
కుంట	7.30
పోలవరం	10.78
రాజమహేంద్రవరం రైల్వే బ్రిడ్జి	14.94



రాజమహేంద్రవరం పుష్కరాల రేవు వద్ద గోదావరి ఉధృతి

వైద్య, ఆరోగ్య శాఖలో సిబ్బంది కొరత



సమావేశంలో మాట్లాడుతున్న గిరిప్రసాద్ వర్మ

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): వైద్య, ఆరోగ్య శాఖలో సిబ్బంది కొరత తీవ్ర ఆందోళన కలిగిస్తోందని, ఇది ప్రజలకు సేవలు అందించడంలో తీవ్ర ఇబ్బందులు కలిగిస్తోందని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం (ఏపీజీఈఏ) జిల్లా అధ్యక్షుడు పి.గిరప్రసాద్‌వర్మ ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో సంఘం జిల్లా కమిటీ సమావేశం శనివారం జరిగింది. వర్మ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు పి.రవికుమార్ మాట్లాడుతూ, రాష్ట్రవ్యాప్తంగా వైద్య, ఆరోగ్య శాఖలో కొన్ని వందల పోస్టులు ఖాళీగా ఉన్నాయని, వీటిని వెంటనే భర్తీ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. దశాబ్దాల నుంచి సిబ్బంది ప్యాటర్న్ మారలేదని, దీనిని మార్చాల్సిన అవసరం ఉందని అన్నారు. సిబ్బంది కొరత కారణంగా జిల్లాలోని ఆసుపత్రుల్లో వైద్య, ఆరోగ్య సేవలు సక్రమంగా అందడం లేదని చెప్పారు. కేవలం కొద్దిమంది కాంట్రాక్టు నర్సులు మాత్రమే ఉన్నారని, పలువురు నర్సులు అవసరమని తెలిపారు. అన్ని ప్రభుత్వ వైద్యశాలల్లో అతి ముఖ్యమైన ధోబీ, బార్బర్, ఎలక్ట్రీషియన్, ప్లంబర్ పోస్టులు ఎత్తివేశారని చెప్పారు. అదనంగా డేటా ఎంట్రీ ఆపరేటర్లను కూడా నియమించాలన్నారు. కమ్యూనిటీ హెల్త్ సెంటర్లలో ఒకప్పుడు ఇరవై ముప్పై మంది మాత్రమే అవుట్ పేషెంట్లు ఉండేవారని, ప్రస్తుతం ఆ సంఖ్య 300కు చేరిందని, కానీ అందుకు తగినట్టుగా సిబ్బంది పెరగలేదని చెప్పారు.

క్లుప్తంగా

వ్యభిచార ముఠా అరెస్టు

పోలీసుల అదుపులో నలుగురు నిందితులు

అమలాపురం టౌన్: పట్టణం గొల్లగూడెంలో ఓ ఇంట్లో వ్యభిచారం నిర్వహిస్తున్న ముఠాను పట్టణ పోలీసులు అరెస్ట్ చేశారు. శుక్రవారం రాత్రి 9 గంటల సమయంలో ఓ ఇంట్లో వ్యభిచారం జరుగుతోందన్న సమాచరంతో ఆ ఇంటిపై దాడి చేసి ఇద్దరు యువతులు, ఇద్దరు విటులను అదుపులోకి తీసుకుని విచారించినట్లు పట్టణ సీఐ పి.వీరబాబు తెలిపారు. అయినవిల్లి మండలం ముక్తేశ్వరంకి చెందిన ఓ యువతి, రాజమహేంద్రవరానికి చెందిన మరో యువతి అక్కడ వ్యభిచారం చేస్తున్నట్లు గుర్తించామని చెప్పారు. అమలాపురం రూరల్ మండలం ఎ.వేమవరంకి చెందిన మల్లవరపు దుర్గారావు, విజయనగరం జిల్లాకు చెందిన పెద్దింటి జయరాజుతో పాటు ఆ ఇద్దరి యువతులను అరెస్ట్ చేసి చేసినట్ల సీఐ వీర బాబు తెలిపారు. వారినుంచి రూ. వెయ్యి నగ దు, ఆరు కండోమ్ ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నామన్నారు. సీఐ కేసు దర్యాప్తు చేస్తున్నామన్నారు.

ఎంపీపీ, జెడ్పీటీసీలకు రేపటి నుంచి శిక్షణ


కేఎన్వీ ప్రసాదరావు

సామర్లకోట: ఉమ్మడి జిల్లాలోని మహిళా ఎంపీపీలు, జెడ్పీటీసీ సభ్యులకు స్థానిక విస్తరణ శిక్షణ కేంద్రంలో సోమవారం నుంచి మూడు రోజుల పాటు శిక్షణ ఉంటుందని ప్రిన్సిపాల్ కరుటూరి నాగ వరప్రసాదరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. నాయకత్వ శిక్షణలో భాగంగా మార్పు ద్వారా విజేతలు పేరిట గత నెల 23 నుంచి శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, పశ్చిమగోదావరి జిల్లాల్లోని మహిళా ఎంపీపీలు, జెడ్పీటీసీలకు జిల్లా పంచాయతీ వనరుల కేంద్రాల సిబ్బంది శిక్షణ ఇచ్చారు. ఉమ్మడి జిల్లాలోని 67 మందికి స్థానిక విస్తరణ శిక్షణ కేంద్రంలో శిక్షణ ఇస్తామన్నారు. మహిళా ప్రతినిధులకు నిర్వహణ నైపుణ్యాలు, నాయకత్వ లక్షణాలు, విధులు–బాధ్యతలు, భావవ్యక్తీకరణ వంటి అంశాలపై శిక్షణ ఉంటుందని తెలిపారు. ప్రతి ఒక్కరూ ఈ శిక్షణకు హాజరై సర్టిఫికెట్లు పొందాల్సి ఉంటుందన్నారు.

శతాధిక వృద్ధురాలి మృతి


నాగరత్నం (ఫైల్)

అమలాపురం టౌన్: పట్టణం కొంకాపల్లి శివారు కురసాల వారి వీధికి చెందిన శతాధిక వృద్ధురాలు అప్పంతుల నాగరత్నం (102) వృద్ధాప్యంతో ఇంట్లో శనివారం మృతి చెందారు. ఆమెకు కుమారుడు, ముగ్గురు మనవళ్లు, ఒక మనమరాలు, 8 మంది ముని మనవళ్లు ఉన్నారు. చనిపోయే కొద్ది నెలల ముందు వరకూ నాగరత్నం తన పని తాను చేసుకునేదని కుటుంబీకులు తెలిపారు.

నిశీధిలో నరసన్న

- కోరుకొండపై అలముకున్న చీకట్లు
- భక్తులకు అసౌకర్యంగా పరిసరాలు
- భీతిగొలిపేలా ఆలయ ఆవరణ

కోరుకొండ: నవ నారసింహ క్షేత్రాలంత ఖ్యాతిని ఆర్జించిన స్థానిక కోరుకొండలో కొలువైన లక్ష్మీ నరసింహస్వామి వారు పొద్దు గుంకింది మొదలు ఉదయపు వెలుగు రేఖలు ప్రసరించే వరకు చీకటిలో మగ్గిపోతున్నారు. ఆలయ ప్రాంగణంతో పాటు, కొండపైకి వెళ్లే మార్గం అంతా చీకటిమయమై అగమ్య గోచరంగా తయారవుతోంది. కొండలపై వెలసిన ఏ దైవ, ఆధ్యాత్మిక క్షేత్రమైనా చక్కని విద్యుత్కాంతులతో అలరారుతూ, భక్తులకు అవసరమైన వసతులు, సౌకర్యాలతో నిండి ఉంటాయి. భక్తులు ఆ వాతావరణాలను ఆస్వాదిస్తూ కొంత మనశ్శాంతి పొందేలా అక్కడి ఆలయ అధికారులు, కమిటీలు ఏర్పాట్లు చేస్తుంటారు. కానీ ఇక్కడి కోరుకొండపై అటువంటి వసతులు, సౌకర్యాలు లేకపోవడంతో భక్తులు సైతం ఉదయ వేళల్లో మాత్రమే కొండపై స్వామివారి దర్శనానికి వెళ్తూ మొక్కులు చెల్లించుకుని వెంటనే దిగిపోతుంటారు.

నిజానికి ఆ కొండపై నుంచి కనుచూపు మేర పల్లె వాతావరణం, కొండలు, గుట్టలు, పచ్చని పొలాలు చాలా ఆహ్లాదంగా ఉంటుంది. కానీ వాటిని ఆస్వాదించే పరిస్థితులు అక్కడ లేకపోవడంతో భక్తులు ఆదరాబాదరాగా వెళ్లి వచ్చేస్తుంటారు. అన్నవరం సత్యనారాయణ స్వామి వారి ఆలయ అధికారుల అజమాయిషీలో ఉన్న ఈ ఆలయాన్ని అక్కడి అధికారులు సైతం చొరవ తీసుకుని అభివృద్ధి చేసే పరిస్థితులు కనుచూపు మేరలో కనపడడం లేదు.

విద్యుద్దీపాలు ఏర్పాటు చేయాలి


నిజానికి స్వామివారికి ఉదయం, సాయంత్రం ధూప, దీప, నైవేద్యాలు సమర్పించి ఉపచారాలు చేయాల్సి ఉంది. ఇది నిరంతరం సాగితే భక్తులు సైతం ఉదయం వేళ మాత్రమే కాకుండా సాయం సమయాల్లో సైతం వచ్చి స్వామివారిని దర్శించి ప్రశాంతతను పొందుతారు. ఇందుకు అవసరమైన విద్యుద్దీపాలను కొండపైన, మెట్ల మార్గంలో ఏర్పాటు చేస్తే ఒకరికి ఇద్దరు, ఇద్దరికి ముగ్గురుగా భక్తులు అధిక సంఖ్యలో వచ్చే అవకాశం ఉంటుంది.

15 దీపాలలో వెలిగేవి రెండే!

దేవస్థానంలో స్వామివారి పాదాల చెంతనుంచి కొండపైకి 15 విద్యుద్దీపాలు ఉన్నప్పటికీ కేవలం రెండు మాత్రమే వెలుగులిస్తున్నాయి. ఒకటి కొండపైన, మరొకటి మెట్ల మార్గంలోది కావడం గమనార్హం.

300 మీటర్లు.. 618 మెట్లతో ఎత్తైన కొండ

స్వామివారు కొలువైన కొండ 300 మీటర్ల ఎత్తులో నిటారుగా ఉంటుంది. దీంతో స్వామివారి దర్శనానికి వెళ్లడం అక్కడి సిబ్బందికి కానీ, భక్తజనానికి కష్టతరంగా ఉంటుంది. మారుతున్న వాతావరణ పరిస్థితుల్లో సాయంత్రం తర్వాత విద్యుద్దీపాలు లేకపోతే దర్శనానికి వెళ్లడం దాదాపు అసాధ్యమనే చెప్పాలి. 618 ఇరుకైన, ఎత్తైన మెట్లు ఎక్కితేనే కానీ దర్శనమీయని స్వామివారు వర్షాకాలంలో మరిన్ని పరీక్షలు పెడుతున్నారు. మెట్లపై నాచు ఏర్పడి జారుడుగా తయారై భక్తులు ప్రమాదాలపాలయ్యే పరిస్థితులు నెలకొన్నాయి.


కోరుకొండ శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి దేవస్థానం (అంతర చిత్రం) లక్ష్మీనరసింహుని మూల విరాట్


కొండపైన స్వామివారి ఆలయం

స్వామి దర్శనానికి భక్తులు అమితం

స్వామివారి దర్శనానికి సుదూర ప్రాంతాల నుంచి విశేష సంఖ్యలో భక్తులు వస్తుంటారు. నిత్యం 200 నుంచి 500 మంది వస్తుండగా, పర్వదినాల్లో వేలాదిగా వస్తారు. స్వామివారి కల్యాణ మహోత్సవానికి లక్షమంది వరకూ హాజరవుతారు. వారిలో చాలా మంది కొండ కిందనున్న స్వామివారిని దర్శించుకుని తిరుగుముఖం పట్టేవారే.

ఒంటి గంటతో అన్న సమారాధన పూర్తి

భక్తులకు ఏర్పాటు చేసే అన్న సమారాధన మధ్యాహ్నం ఒంటి గంట వరకే నిర్వహిస్తున్నారు. దీంతో కొండపైకి వెళ్లి తిరిగి వచ్చే వారికి అన్న ప్రసాదం దక్కడం లేదు. అలాగే భోజనానికి అవసరమైన దినుసులు తగ్గించి ఇచ్చి వంటలు చేయాలంటున్నారని అన్నవరం దేవస్థానం స్థానిక ప్రతినిధి ఒకరు చెప్పడం గమనార్హం.

స్థానికులకు స్వామివారి దర్శనం మృగ్యం

కోరుకొండ ప్రజలు ఉదయ, సాయం సంధ్య వేళల్లో కొండపైనున్న స్వామివారిని దర్శించి అనంతరం వాకిళ్లు తుడుచుకుని ఇంటి పనుల్లో నిమగ్నమవుతుంటారు. కానీ కొండపై విద్యుద్దీపాలు లేకపోవడంతో ఆలయ విమాన గోపురం కానీ, మరేవీ కనపడక అసంతృప్తి వ్యక్తం చేస్తుంటారు.

పరిష్కార చర్యలు చేపట్టాం



స్వామి వారి దర్శనంలో భక్తులకు ఎదురవుతున్న సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడుతున్నాం. విద్యుద్దీపాలకు మరమ్మతులు చేయిస్తాం. కొండపై వసతులు పెంచేలా చర్యలు తీసుకుంటాం.

– వీర్ల సుబ్బారావు, ఈఓ, అన్నవరం దేవస్థానం

వీనుల విందైన ప్రబంధాలేవీ?

స్వామివారి సేవా కాలంలో శ్రీవైష్ణవులు చదివే ప్రబంధం వినే సదుపాయాన్ని భక్తులు కోల్పోయారు. కొంతకాలంగా మైక్‌లు పనిచేయక పోవడంతో ఈ సమస్య ఉత్పన్నమైంది. మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా వీటిని ఏర్పాటుచేశారు. దేవస్థానం నుంచి కోరుకొండ బస్టాండ్ వరకూ ఏర్పాటు చేసి మైక్ సెట్లు మరమ్మతులకు గురై స్వామివారి సేవాకాలంలో ప్రసారం చేసే ప్రబంధాలు వినే భాగ్యాన్ని భక్తులు కోల్పోయారు.

అర్చకస్వాముల సంఖ్య పెంచాలి

స్వామివారి దేవస్థానంలో అర్చకస్వాముల సంఖ్యపెంచి, భక్తుల కోరిక మేరకు కొండపైన సాయంత్రం వేళల్లో సేవాకాలం నిర్వహించేందుకు అన్నవరం అధికారులు చర్యలు తీసుకోవాలి. ప్రస్తుతం దేవస్థానంలో ఐదుగురు అర్చకులు ఉన్నారు. వీరిలో ఇద్దరు ఈనాందారులు (వీరికి దేవస్థానం భూములివ్వడం జరిగింది), మరో ముగ్గురిని అన్నవరం దేవస్థానం జీతాలిస్తూ నిర్వహిస్తోంది. వీరు చాలకపోవడంతో సాయంత్రం కొండపైన సేవాకార్యక్రమాలు సాగడం లేదు. వీరంతా వంతులవారీగా కొండపైకి వెళ్లివస్తుంటారు.


కొండపైన స్వామి దర్శనానికి వెళ్లే ఇరుకైన మెట్ల మార్గం

స్వామివారి సేవల వేళలివీ..

దేవస్థానం కొండపైన, కింద ఆలయంలో ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ సేవా కాలం నిర్వహిస్తున్నారు. సాయంత్రం మాత్రం కొండ కిందనే ఐదు గంటల నుంచి ఏడు గంటల వరకూ సేవలు నిర్వహిస్తున్నారు. కానీ పలు సమస్యల నేపథ్యంలో కొండపైన సాయంత్రం వేళల్లో ఏ కార్యక్రమాలు నిర్వహించడం లేదు.

వాడపల్లి క్షేత్రం జన సంద్రం

దేవస్థానం ఆదాయం రూ.62.53 లక్షలు

కొత్తపేట: ఆత్రేయపురం మండలం వాడపల్లి వెంకన్న ఆలయం శనివారం జనసంద్రమైంది. అంతకంతకూ భక్తజనం పెరుగుతుండడంతో కోనసీమ తిరుమలగా ఈ క్షేత్రం ప్రఖ్యాతమవుతోంది. శనివారం రాష్ట్ర నలుమూలల నుంచి అశేష సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. దేవస్థానం ఈఓ నల్లం సూర్యచక్రధరరావు పర్యవేక్షణలో, ఆలయ ప్రధాన అర్చకుడు ఖండవిల్లి ఆదిత్య అనంత శ్రీనివాస్ ఆధ్వర్యంలో అర్చకస్వాములు ప్రత్యేక పూజలు చేసి విశేషంగా అలంకరించారు. సాధారణ భక్తులతో పాటు ×ఏడు శనివారాల¥ నోము ఆచరిస్తున్న భక్తులతో వాడపల్లి క్షేత్రం కిక్కిరిసిపోయింది. అనంతరం తీర్థప్రసాదాలు, అన్నప్రసాదం స్వీకరించారు. భక్తుల సౌకర్యార్థం డీసీ అండ్ ఈఓ చక్రధరరావు ఆధ్వర్యంలో సిబ్బంది ఏర్పాట్లను పర్యవేక్షించారు. సాయంత్రం 4 గంటల వరకూ స్వామివారి ప్రత్యేక దర్శనం, విశిష్ట దర్శనం, వేద ఆశీర్వచనం, అన్నప్రసాద విరాళం, సేవలు, లడ్డూ విక్రయం, ఆన్‌లైన్ తదితర సేవల ద్వారా దేవస్థానానికి రూ.62,52,971 ఆదాయం వచ్చినట్టు ఈఓ చక్రధరరావు తెలిపారు. ఎస్సై రాము ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.


వాడపల్లిలో స్వామి దర్శనానికి వెళ్తున్న భక్తజనం

శిష్యుడినని నమ్మించి శఠగోపం

- గురువు ఇంటికి సమీపంలోనే అద్దెకు దిగి అదను చూసి చోరీ
- రూ.50 లక్షల విలువైన బంగారు ఆభరణాలు అపహరణ
- నాలుగు రోజుల్లో నిందితుడిని అరెస్టు చేసి సొత్తు రికవరీ

అమలాపురం టౌన్: నేను మీ వద్దే చదువుకున్నానని.. ఆ ఉపాధ్యాయుడి ఇంటి పక్కనే మరో ఇంటిలో అద్దెకు దిగిన పూర్వ విద్యార్థి గురువు ఇంటికే కన్నం వేసి విలువైన బంగారు ఆభరణాలను దోచుకున్నాడు. స్థానిక జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ బి.కృష్ణారావు శనివారం విలేకరుల సమావేశంలో ఈ ఘటన వివరాలను వెల్లడించారు. రామచంద్రపురం పట్టణం రామదుర్గా వీధిలో ఓ డాబా ఇంట్లో ఉపాధ్యాయుడు దొంతంశెట్టి శ్రీనివాస్ నివసిస్తున్నారు. దేవగుప్త వీరబ్రహ్మం అనే 30 ఏళ్ల యువకుడు ఆయన విద్యార్థినని పరిచయం చేసుకుని ఆయన ఇంటికి సమీపంలోనే మరో ఇంటిలో అద్దెకు దిగాడు. ఈనెల మూడున ఉపాధ్యాయుడు శ్రీనివాస్ ఇంటికి తాళం వేసి కుటుంబంతో విశాఖపట్నం బంధువుల ఇంటికి వెళ్లారు. ఇదే అదనుగా వీరబ్రహ్మం ఇంటిలోని తలుపు బోల్టును పగలగొట్టి రూ.50 లక్షల విలువైన 463 గ్రాముల బంగారాన్ని దోచుకుని ఉడాయించాడు. ఈ నెల ఏడో తేదీన విశాఖ నుంచి తిరిగి వచ్చిన శ్రీనివాస్ తన ఇంట్లో దొంగతనం జరిగిన విషయాన్ని గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్ రంగంలోకి దిగి, సీసీ కెమేరా ఫుటేజీల సాయంతో చోరీకి పాల్పడిన వీరబ్రహ్మంను అరెస్టు చేసి అతని నుంచి చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని శుక్రవారం అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచారు.



చోరీకి గురైన బంగారు నగలను చూపించి కేసు వివరాలను వెల్లడిస్తున్న జిల్లా ఎస్పీ కృష్ణారావు

పోలీసులకు ఎస్పీ అభినందనలు

కేసును చాకచక్యంగా దర్యాప్తు చేసి నిందితుడిని అరెస్టు చేసి సొత్తును రికవరీ చేసిన రామచంద్రపురం డీఎస్పీ బి.రఘువీర్, సీఐ ఎం.వెంకటనారాయణ, క్రైమ్ సీఐ ఎం.గజేంద్రకుమార్, రామచంద్రపురం ఎస్సై నాగేశ్వరరావు, ద్రాక్షారామ ఎస్సై లక్ష్మణ్, క్రైమ్ ఏఎస్సై అయితాబత్తుల బాలకృష్ణ, హెడ్ కానిస్టేబుల్ వీరబాబు, కానిస్టేబుళ్లు ఏసుకుమార్, సూరిబాబు, అనిల్ కుమార్, లోవరాజు, అర్జున్, ఐటీ కోర్ కానిస్టేబుల్ జాఫర్‌లను ఎస్పీ కృష్ణారావు ప్రత్యేకంగా అభినందించారు. వారికి రివార్డులు, ప్రశంసా పత్రాలు అందించి అభినందించారు.

సాక్షి సండే క్లాసిఫైడ్స్

Education

DISTANCE EDUCATION

■ టెన్త్ ఇంటర్ వన్ సిట్టింగ్, డిగ్రీ, పీజీ, సైన్స్ & ఆర్ట్స్ MBA, MCA అన్ని యూనివర్సిటీల పరీక్షలు మా కాకతీయ విద్యాసంస్థలు, కాకినాడ దగ్గరలోని గొల్లపాలెంలో జరుగును. 100% పాస్ గైడెన్స్, మా ఆఫీసులు : కాకినాడ, రాజమండ్రి, రావులపాలెం. ఫోన్ : 82975 92043, 99494 82757 [V- 2829]

Real Estate

HOUSE FOR SALE

■ రాజమండ్రి-ఆనందనగర్‌లో E/F, 110 గజాల డూప్లెక్స్ బిల్డింగ్, కొంతమూరు కళ్యాణ్ నగర్‌లో N/F 175 గజాల బిల్డింగ్ & పరిమినగర్‌లో S/F 150 గజాల బిల్డింగ్ అమ్మకమునకు కలవు. ✆ : 90144 68992 [R-55]

LAND FOR SALE

■ హంసవరం రైల్వేస్టేషన్ దగ్గరలో 30 సెంట్లు ఫామ్‌ల్యాండ్ అమ్మకము మరియు కాకినాడ APSP ఎదురుగా తూర్పు ఫేసింగ్ బిల్డింగ్ అమ్మకమునకు కలదు. ✆ : 99121 30247 [R-54]

■ కడియం, బుర్రిలంక హైవేకి దగ్గరలో ఒక ఎకరం భూమి అమ్మకమునకు కలదు. ఫంక్షన్ హాల్ కి / స్కూల్స్ / కాలేజ్‌లకి అనువైనది. ✆ : (C) 94402 37253 [SCA25006245]

PLOT FOR SALE

■ కొండయ్యపాలెం ఫ్లై ఓవర్ జంక్షన్‌లో సుమారుగా 440 గ॥లు మరియు ఉప్పాడలో స్థలములు అమ్మకమునకు కలదు. Cont: P.A. స్వామి, ✆ : 98481 07949, 99856 46888. [R-53]

■ రాజమండ్రి, రాజవోలు దగ్గరలో శ్రీమాన్ గేటెడ్ కమ్యూనిటీలో ఓపెన్ సైట్స్, ఇండిపెండెంట్ హౌస్‌లు, విల్లాస్ మరియు అపార్ట్మెంట్స్ కొరకు సంప్రదించండి. JSR – ✆ : 70139 92077 [R-960]

■ మీ పెట్టుబడికి ఇదే సరైన సమయం రాజధాని ప్రాంతంలో అమరావతి - విజయవాడ రోడ్‌లో గృహ నిర్మాణానికి అనువైన ప్లాట్లు చ.గ. రూ.13 వేలు మాత్రమే స్పాట్ రిజిస్ట్రేషన్ 9966666034 [G-70]

■ కాకినాడ, మధురానగర్, పెద్ద కాపుగారి వీధిలో 33×54 కొలతలతో 198 గజాల వెస్ట్ ఫేసింగ్ ఖాళీ స్థలం అమ్మబడును. ✆ : 83329 92099 [SCA25005532]

■ Rjy: బూరుగుపూడి ఇళ్ల మధ్యలో తక్షణం ఇంటి నిర్మాణం గల స్థలములు E/F, W/F 30 అడుగుల రోడ్డు, అమ్మకానికి కలవు. ✆ : 99088 71143 [SCA25005040]

■ పెద్దాపురం, సామర్లకోట, DTCP లేఅవుట్ నందు 245 గజాలు E/F 175 గజాలు W/F 200 గజాలు S/F 200 N/F, స్థలాలు అమ్మకము. చ॥గ॥ Govt Value 10,000. బ్యాంక్ లోన్ సదుపాయం కలదు. 9052224444 P[SCA-25005671]

LEASE / RENT

■ కాకినాడ- భానుగుడి శంకర్ ప్లాజాలో గ్రౌండ్ ఫ్లోర్ 1200Sft షాపు హోటల్స్‌కు /కమర్షియల్ / ఆఫీసులకు అనువుగా అద్దెకు కలదు. కాకినాడ - వాలకపూడి సాయి బాబా మందిరం దగ్గర గ్రౌండ్ ఫ్లోర్ 450గ॥లో 2500 Sft. 4 BHK ఇండివి వద్యువల్ హౌస్ Fully ఫర్నీ చర్. ఏసీ, టీవీ, (2కార్స్‌పార్కింగ్) తో లీజుకు / అద్దెకు ఇవ్వ బడును. సెల్ : 9989922633 [SCA-25005974]

TO-LET

■ ఈదరపల్లి VPC థియేటర్ తరువాత బస్ డిపో వెనుక మా స్థలం లో గొడౌన్ (షెడ్) సుమారు 15000 Sft కట్టి అద్దెకు ఇవ్వబడును. సంప్రదించండి: 91775 12333, 94408 45999 [SCA-25006026]

■ Commercial space for rent. G+2 9000 sft, suitable for IT office, schools, banks, education institutions ,near Nayara Petrol Bunk, 100 feet road, Rajahmundry. Cell Number : 98660 63232. [SCA25005032]

Services

BUSINESS OFFER

■ Need Monthly Good Returns ? Good Investment & good Profits & Good Earnings. Sharing 70:30. Safe and Secure. 6301859174 [SCA25006206]

■ Hyderabad based Healthcare Manufacturing Company is seeking business investors, Proven clientele, Good monthly Returns. 9063573311 [HA-267872]

Wanted

■ రాజమండ్రి దానవాయిపేట డా॥ స్మైల్ & స్టార్ కిడ్స్ డెంటల్ క్లినిక్ నందు పని చేయుటకు అసిస్టెంట్స్ కావలెను. జీతం : 7500–8500 ✆ : 93333 34337 [R-7457]

■ మెకానిక్ హెల్పర్లు కావలెను. జీతము 10,000/- నుండి 25,000/- వరకు శ్రీదేవి హోండా, ఆథరైజ్డ్ డీలర్. హోండా టూ వీలర్స్, టూటౌన్ పోలీస్ స్టేషన్ వద్ద, మెయిన్ రోడ్, కాకినాడ. ✆ : 94909 98888 [R-51]

■ కాకినాడ సిటీలో ప్రముఖ పెట్రోల్ బంకు నందు (కాకినాడ ప్రాంతం వారు మాత్రమే) పనిచేయుటకు పంప్ బాయ్స్, మరియు గర్ల్స్, సూపర్ వైజర్ కావలెను. ఆకర్షణీయ మైన జీతం ఇవ్వబడును. ✆ : 98496 33555 [R-1030]

■ ఆపరేషన్ థియేటర్‌లో అనుభవము కలిగిన నర్సులు మరియు కాంపౌండర్స్ కావలెను. ప్రగతి సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్, ప్రకాష్‌నగర్ మెయిన్‌రోడ్, రాజమండ్రి [R-247]

■ కాకినాడ ఇంట్లోనే ఉండి ఇంటి పని వంట పని చేయుటకు 40 సంవత్సరాలు లోపు మహిళ కావలెను ✆ : 93908 07320, 0884 -2362015 [SCA25006031]

■ వ్యాన్ డ్రైవర్స్ కావలెను. జీతం : రూ.15,000/- + డైలీ రూ.100/-. శ్రీదేవి హోండా. ఆథరైజ్డ్ డీలర్ : హోండా టూ వీలర్స్, టూ టౌన్ పోలీస్‌స్టేషన్ దగ్గర, మెయిన్‌రోడ్, కాకినాడ. Ph: 94909 98888 [R-48]

■ రాజమండ్రిలో ఇంట్లో వుంటూ ఒక మగ మనిషిని చూసుకోవడానికి వంట తెలిసిన పని మనిషి కావలెను. ఫోన్ : 70139 19459 [V- 2834]

■ హైదరాబాద్‌లోని వృద్ధాశ్రమంలో పని చేయుటకు నర్సులు, కేర్ టేకర్లు, ఆడ/మగ/జంట కావలెను. ఫోన్: 9347556162 / 8309615249 [HA-58956]

■ కన్సల్టెన్సీ కాదు.VIPఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవ డానికి స్త్రీలు/పురుషులు ఆయా, నర్సులు, వంటవారు,RMP& డాక్టర్స్ కావలెను. జీ: 15వేలు -40వేలు,ఫ్రీరూం+భోజనం. Hyd.9014885406 [HA-15968]

■ కేర్ టేకర్స్, నర్సులు కావలెను. VJAలో ప్రముఖ హోమ్‌కేర్ సర్వీసెస్‌లో ఇంటివద్దనే వుండి పెద్ద వారిని చూసుకొనుటకు అనుభవంగల వర్కర్స్, మంచిజీతం ✆ 99121 15559, 91608 35559 [B-136]

■ Wanted Spoken english Teachers for primary Classes. Send Resume by Post/Whatsapp: 99498 54577 Bethel High school, P & T Colony, RJY-5. [R-SCA25005944]

■ Wanted Male Counselors, Cashier cum Computer Operators and Administrative Staff, Qualification Any Degree, Age Limit: 25 to 45 years, Salary upto: 20000/-. Working Location: Master Minds College, Rajahmundry, Contact: 92487 33370 [G-6085]

■ స్వామి వివేకానంద ఓల్డేజ్ హోం (VJA) శ్రీమంతుల ఇండ్లలో వృద్దుల/పేషంట్ల సేవకు, ఇంటి/ వంట పని, బేబీ కేర్ కొరకు 10th ఆపై చదివి, Age: 20-30 కలిగిన (M/F) వర్కర్లు కావలెను. భో+వ+జీ: 18-20 వేలు. ఏజెంట్ల కమీషన్: 5000 ✆ 9963521122, 9963101122 [B-1275585]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకు

సాక్షి క్లాసిఫైడ్స్

నాలుగు లైన్లకు రూ. : 400/-
అదనపు లైనుకు రూ. : 90/-
GST 5% Extra

రీజనల్ సెంటర్లు - రాజమండ్రి - 9010224454, 9951602906, 9010120345, 9705754205
కాకినాడ, పిఠాపురం, పెద్దాపురం : 99516 02838
తుని, జగ్గంపేట, యానాం : 90109 67896
అమలాపురం, ముమ్మిడివరం : 97053 47414
పి.గన్నవరం : 97057 49718, రాజోలు : 97053 46456
మండపేట : 99516 02941
రామచంద్రపురం : సెల్ : 99516 02936

సర్వే నెం.264, ADB రోడ్, రాజానగరం. ఫోన్స్: 0883-2483010

గుండె గుబిల్లు @ రూ.15 లక్షలు

మామిడికుదురులో ఒక ఇంటికి వచ్చిన కరెంటు బిల్లు రూ.15,14,993 లక్షలు

మామిడికుదురు: గ్రామానికి చెందిన నన్నేషా హుస్సేన్ తన ఇంటికి వచ్చిన విద్యుత్ బిల్లు చూసి లోబో దిబోమంటున్నారు. ఆయన ఇంటికి అక్షరాల రూ.15,14,993 బిల్లు వచ్చింది. గత నెల 221 యూనిట్లకు రూ.1333 బిల్లు రాగా, ఈ నెల 1,54,525 యూనిట్లకు రూ.15 లక్షలు బిల్లు వచ్చిందన్నారు. అధికారుల నిర్లక్ష్యమే దీనికి కారణమని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిని సరిచేయాలని డిమాండ్ చేశారు. దీనిపై సంబంధిత జేఈ వెంకటేశ్వరరావును వివరణ కోరగా జంపింగ్ వల్ల ఈ తేడా జరిగిందన్నారు. ఈ బిల్లును సరిచేస్తామని చెప్పారు.



BILL DETAILS

EPDCL Eastern Power Distribution Company of Andhra Pradesh Limited

Present Reading	167845
Previous Reading	13320
Billed Units	154525
Energy Charges	1505267.05
Fixed Charges	20.0
Customer Charges	55.0
ED Charges	9271.5
TOTAL	1514993.0

నన్నేషా హుస్సేన్ ఇంటికి వచ్చిన కరెంటు బిల్లు

భార్యతో గొడవ పడి భర్త ఆత్మహత్య

రాజానగరం: స్థానిక పోలీసు స్టేషను పరిధిలోని కొంతమూరులో భార్యతో గొడవ పడి భర్త ఆత్మహత్య చేసుకున్న సంఘటన శనివారం జరిగింది. ఎస్సై ప్రియకుమార్ తెలిపిన వివరాల మేరకు డెంటల్ ఎక్విప్‌మెంట్ టెక్నిషియన్‌గా పనిచేస్తున్న గోర్ల గోవిందరావు (44)కు తాళ్లూరుకు చెందిన విజయతో 15 ఏళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. కొంతకాలంగా వారి మధ్య మనస్పర్థలు ఏర్పడి గొడవ పడుతుండేవారు. ఈ క్రమంలో శుక్రవారం రాత్రి వారి మధ్య ఘర్షణ జరగడంతో విసిగిపోయిన గోవిందరావు కొంతమూరులోని తన ఇంటిలో ఆర్చ్‌కి ఉన్న కొక్కానికి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

దోపిడీ కేసులో ఇద్దరి అరెస్టు

పిఠాపురం: జనంతో రద్దీగా ఉండే పిఠాపురం ఉప్పాడ సెంటర్లో ఒక వ్యక్తిని నమ్మించి మోసగించి నగదు దోపిడీ చేసిన ఇద్దరు నిందితులను శనివారం అరెస్టు చేసినట్లు పిఠాపురం సీఐ జి.శ్రీనివాస్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం శంఖవరానికి చెందిన వాతాడ దిలీప్ ఈ నెల ఐదో తేదీ 11.30 గంటల సమయంలో పిఠాపురం ఉప్పాడ రోడ్ సెంటర్‌లో శంఖవరం వెళ్లేందుకు వేచి ఉన్నాడు. ఇంతలో ఇద్దరు దుండగులు మోటార్ బైక్‌పై వచ్చి ఇక్కడ ఎంత సేపు ఎదురు చూసినా ఏ వాహనాలు రావని బైపాస్ రోడ్డులోకి వెళితే ఏదో ఒక వాహనం ఎక్కి వెళ్లవచ్చని మాయమాటలు చెప్పి తమ బైక్‌పై తీసుకువెళ్లారు. హైవే రోడ్డుపైకి తీసుకెళ్లి, టీ టైమ్ షాప్ దాటాకా చీకటిలో హైవే పక్కన వాహనాన్ని ఆపి దిలీప్‌ను తుప్పల్లోకి తీసుకువెళ్లి, కత్తి చూపించి బెదిరించి అతని వద్ద నుంచి రూ.29,400 బలవంతంగా లాక్కుని పరారయ్యారు. దీంతో బాధితుడు ఈ నెల 9వ తేదీన పిఠాపురం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసిన దార్యప్తు ప్రారంభించిన పోలీసులు సీసీ టీవీ ఫుటేజీల ఆధారంగా పిఠాపురం పట్టణం కొత్తపేటకు చెంది ఆనందభూపతి శ్రీనివాసు, పిఠాపురానికి చెందిన బర్ల నరేష్‌లుగా గుర్తించారు. వీరిని శనివారం పిఠాపురంలో అరెస్టు చేసి వారి నుంచి ఒక మోటారు సైకిల్ రూ.16 వేల చోరీ సొత్తు, ఒక చాకు స్వాధీనం చేసుకుని నిందితులను కోర్టులో హాజరుపర్చినట్లు ఆయన తెలిపారు.

ప్రగతి విద్యార్థులకు అమెజాన్ కొలువులు

రూ.30 లక్షల ప్యాకేజీతో 8 మంది ఎంపిక


డాక్టర్ పరుచూరి కృష్ణారావు, కళాశాల చైర్మన్

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): గ్లోబల్ టెక్ దిగ్గజ సంస్థ అమెజాన్‌లో ప్రగతి ఇంజినీరింగ్ విద్యార్థులు 8 మంది రూ.30 లక్షల వార్షిక వేతనంతో ఎంపికయ్యారని కళాశాల చైర్మన్ డాక్టర్ పరుచూరి కృష్ణారావు శనివారం తెలిపారు. 2025లో ఉత్తీర్ణులైన 11 మంది విద్యార్థులు అమెజాన్‌లో 6 నెలల ఇంటర్న్‌షిప్‌కు ఎంపికకగా వీరిలో 8 మంది ఫుల్‌టైం ఉద్యోగులుగా అధిక ప్యాకేజీతో ఉద్యోగాలు సాధించారన్నారు. ఇంటర్న్‌షిప్ సమయంలో రూ.50 వేల నుంచి రూ.70 వేల వరకూ స్టైఫండ్ పొందారని తెలిపారు. 2024–25కు సంబంధించి ప్రముఖ మల్టీనేషనల్ కంపెనీలు 54 సంస్థల్లో 1,629 మంది ఉద్యోగాలు సాధించారని, వీరిలో రూ.40 లక్షల ప్యాకేజీతో ఇద్దరు ఉన్నారన్నారు. విద్యార్థులు ఆర్.శ్రీజస్వరూప, ఇ.కోమల, జి.మేఘన, డి.అదితి, పి.మధు, వై.రేష్మచౌదరి, సీహెచ్.సత్యశ్రీ, కె.శ్రావ్యలు ఉద్యోగాలు సాధించారని, ఉభయ గోదావరి జిల్లాలో వివిధ గ్రామీణ ప్రాంతాల విద్యార్థులు కావడం విశేషమన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను డైరెక్టర్ మేనేజ్‌మెంట్ హరినాథ బాబు, వైస్ ప్రెసిడెంట్ ఎం.సతీష్, డైరెక్టర్ అకడమిక్స్ సత్యనారాయణ, ప్రిన్సిపాల్ నరేష్ అభినందించారు.

ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాల దరఖాస్తులకు గడవు పెంపు

రాజమహేంద్రవరం సిటీ: జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలకు ఆన్‌లైన్‌లో తమ ప్రతిపాదనలు సమర్పించేందుకు ఈనెల 17 తేదీ వరకూ గడువు పొడిగించినట్లు జిల్లా విద్యాశాఖాధికారి కె.వాసుదేవరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని అన్ని యాజమాన్యాల ప్రభుత్వ, జెడ్పీ, మండల పరిషత్, ఎయిడెడ్, పురపాలక యాజమాన్యాలు గల ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో పనిచేసే అన్ని కేటగిరీలకు చెందిన అర్హతగల ఉపాధ్యాయులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

అంబాజీపేట కొబ్బరి మార్కెట్

కొబ్బరి రకం	ధర (రూ.ల్లో)
కొత్తకొబ్బరి (క్వింటాల్)	23,000 – 23,500
కొత్తకొబ్బరి (రెండవ రకం)	10,500 – 12,000
కురిడీ కొబ్బరి (పాతవి)	
గండేరా (వెయ్యి)	26,500
గటగట (వెయ్యి)	25,500
కురిడీ కొబ్బరి (కొత్తవి)	
గండేరా (వెయ్యి)	25,500
గటగట (వెయ్యి)	24,500